క్లుప్తంగా

వేసవి విజ్ఞాన శిబిరాన్ని వినియోగించుకోండి


మాట్లాడుతున్న సుభాష్ చంద్రబోస్

కర్నూలు (న్యూసిటీ): విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరాన్ని వినియోగించుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 8 నుంచి జూన్ 11వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వ్యక్తిత్వ వికాసం, యోగా, చదవడంపై ఆసక్తి పెంచడం తదితర అంశాలపై నిపుణలతో ప్రత్యేక తరగతులు ఏర్పాట్లు చేశామన్నారు. అలాగే విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను గుర్తించి అందులో ప్రోత్సహిస్తామని చెప్పారు.

గుత్తి సెబ్ సీఐపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి


ధర్నా నిర్వహిస్తున్న తండా వాసులు

కర్నూలు(సెంట్రల్): తన భర్తపై అన్యాయంగా పీడీ యాక్ట్ పెట్టి జైలుకు పంపిన గుత్తి సెబ్ సీఐ వరాల లక్ష్మీపై ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కింద కేసు నమోదు చేయాలని తుగ్గలి మండలం గుడుంబాయ్ తండాకు చెందిన లలిత బాయ్ అనే మహిళ డిమాండ్ చేసింది. శుక్రవారం ఆమె కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..తన భర్త గుత్తిలో బామాల్ నాయక్ పెంటింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారన్నారు. అయితే, ఇటీవల గుత్తి సీఐ రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారని, ఇవ్వకపోవడంతో నాటుసారా అమ్ముతున్నట్లు కేసు నమోదు చేసి అరెస్టుచేశారన్నారు. వెంటనే ఈ సంఘటనపై విచారణ జరపాలని ఆమె కోరారు. ఆమెకు మద్దతు గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

పుల్లారెడ్డి ఇంజినీరింగ్ విద్యార్థినికి గోల్డ్‌మెడల్


బంగారు పతకం సాధించిన మేఘనారెడ్డిని అభినందిస్తున్న సీఈఓ రమణ

కర్నూలు (టౌన్): జి. పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన మొదటి సంవత్సరం బీటెక్ విద్యార్థిని మేఘనారెడ్డి రేస్ వాక్ (పరుగు)లో బంగారు పతకం సాధించింది. ఈనెల 8 వ తేదీ నుంచి 10 వ తేదీ వరకు గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న మేఘనారెడ్డి 20 కిలో మీటర్ల రేస్ వాక్ క్రీడాంశంలో ప్రతిభ చాటి మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించింది. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సీఈఓ రమణ ఆ విద్యార్థినిని శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కోచ్ హారిక పాల్గొన్నారు.

కార్మిక హక్కుల సాధనకు ఐక్య పోరాటాలు

కర్నూలు(సెంట్రల్) : కార్మికుల హక్కుల కోసం ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ, ఉపాధ్యక్షుడు డి.గౌస్‌దేశాయ్ పిలుపునిచ్చారు. శుక్రవారం కార్మిక, కర్షక భవన్‌లో ఆయిల్ అండ్ రైస్ మిల్లుల హమాలీల సంఘం జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హమాలీల కూలీ రేట్ల పెరుగదల కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో రోజురోజుకు ధరలు పెరిగిపోతుండడంతో హమాలీలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. నాలుగు లేబర్ చట్టాల కోసం మళ్లీ ఉద్యమ బాట పట్టాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్ సాయిబాబా, ఆర్.నరసింహులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత అలవర్చాలి


ర్యాలీలో చిన్నారులు

కర్నూలు (టౌన్) : తల్లిదండ్రులు తమ పిల్లలను చిన్నప్పటి నుంచే ఆధ్యాత్మికభావాలను అలవర్చాలని గిప్సన్ సెంట్రల్ బాప్టిస్టు చర్చి పాస్టర్ రెవరెండ్ కృపాదానం అన్నారు. శుక్రవారం గిప్సన్ కాలనీ చర్చి ఆధ్వర్యంలో వేసవి విరామ బైబిల్ పాఠశాల తరగతులు ప్రారంభించారు. చిన్నారులను ఆ ఏరియా పరిధిలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గిప్సన్ చర్చి సంఘం కార్యదర్శి వినోద్ జోషీ, కోశాధికారి బి. మాధవ రావు, సండే స్కూల్ సూపరింటెండెంట్ విక్రమ్ కుమార్, సండే స్కూల్ టీచర్లు జోత్స్న, కిరణ్, ఫ్రాంక్లిన్, దేవప్రసాద్ పాల్గొన్నారు.

కేవీఆర్‌లో ఆధిపత్య పోరు !

- ఒకే సబ్జెక్టులో 37 మంది ఫెయిల్
- పునఃమూల్యాంకనంపై స్పందించని ప్రిన్సిపాల్
- క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేసిన గణిత అధ్యాపకుడు
- విచారణ కమిటీని నియమించిన వీసీ
- కాలేజీలోకి అనుమతించని ప్రిన్సిపాల్
- ఆర్జేడీతో విచారణ జరిపించిన ఉన్నత విద్యామండలి
- విచారణ సరిగ్గా చేయలేదని వర్సిటీ అధికారుల ఆరోపణ



కర్నూలు సిటీ: రాయలసీమలో కేవీఆర్ మహిళ డిగ్రీ కాలేజీకి ఓ ప్రత్యేక గుర్తింపు ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో పలు జిల్లాలకు చెందిన పేద విద్యార్థులకు విద్యనందించిన కాలేజీగా పేరు. అలాంటి ఈ విద్యాసంస్థలో పనిచేసే అధ్యాపకుల మధ్య ఆధిపత్య పోరు సాగుతోంది. ఫలితంగా కాలేజీ ప్రతిష్ట మసకబారుతోంది. స్వయంప్రతిపత్తి కలిగిన కేవీఆర్ కాలేజీలో చదువుతున్న విద్యార్థులకు అక్కడే పరీక్షలు నిర్వహించి, మూల్యాంకనం చేస్తారు. ఇందులో భాగంగా గతేడాది ఓ సెమిస్టర్ పరీక్షల్లో ఒకే సబ్జెక్టులో అత్యధిక మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. దీనికి రెగ్యులర్ ఫ్యాకల్టీ కాకుండా కాంట్రాక్ట్ అధ్యాపకులతో మూల్యాంకనం చేయించడమే కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బీఎస్సీలో ఎంపీసీ, ఎంపీసీఎస్, ఎంసీడీఎస్ కోర్సులు ఉన్నాయి. ఈ కోర్సులలో సుమారుగా 150 మంది విద్యార్థులు చదువుతున్నారు. బీఎస్సీ కోర్సులో ఎంపీసీ గ్రూప్ చదువుతున్న విద్యార్థులు 37 మంది ఫెయిల్ అయ్యారు. సంబంధిత గ్రూప్‌నకు గణిత సబ్జెక్టు బోధించే లెక్చరర్ పునఃమూల్యాంకనానికి కోరగా, ప్రిన్సిపాల్ స్పందించలేదని, పిల్లల భవిష్యత్తు నాశనమవుతుందని క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కు గతేడాది అక్టోబరు 10వ తేదీన ఫిర్యాదు చేశారు. దీనిపై వీసీ రిజిస్ట్రార్ చైర్మెన్‌గా ఓ 5 మంది లెక్చరర్లతో కమిటీ ఏర్పాటు చేశారు. సదరు కమిటీ సభ్యులు గత నెలలో విచారణ నిమిత్తం కాలేజీకి రాగా ఇది అటానమస్ కాలేజీ అని, మీరు విచారణ ఎలా చేస్తారని కాలేజీ ప్రిన్సిపాల్ అనుమతించలేదు. దీనిపై సదరు కమిటీ ఉన్నత విద్యాశాఖ, కాలేజీయేట్ కమిషనర్, ఉన్నత విద్యా మండలికి ఫిర్యాదు చేయడంతో డిగ్రీ కాలేజీల ఆర్జేడీని నియమించారు. అయితే, సదరు ఆర్జేడీ ఫిర్యాదుపై కాకుండా విరుద్ధ అంశాలపై విచారణ చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై క్లస్టర్ యూనివర్సిటీ అధికారులు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేయనున్నట్లు తెలుస్తోంది.

విద్యార్థులే సమిధలు!

కేవీఆర్ మహిళ డిగ్రీ కాలేజీ 1958లో ఏర్పాటు చేశారు. ఈ కాలేజీలో కాంట్రాక్ట్, రెగ్యులర్ టీచింగ్ ఫ్యాకల్టీ 78, నాన్ టీచింగ్ ఫ్యాకల్టీ 42 మంది పని చేస్తున్నారు. కాలేజీ ప్రిన్సిపాల్‌గా అందులో పని చేసే సీనియర్ లెక్చరరే ఉంటారు. గతంలో పని చేసిన ఓ ప్రిన్సిపాల్, ప్రస్తుతం పని చేస్తున్న ప్రిన్సిపాల్‌కి అక్కడ పని చేస్తున్న కొందరు లెక్చరర్లకు వివిధ అంశాల్లో బేధాభిప్రాయాలు ఉన్నాయి. ఈ కారణాలతోనే మధ్యలో విద్యార్థులను బలి చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. చాలా మంది అధ్యాపకులు పాఠ్యంశాల బోధనను వదిలేసి ప్రిన్సిపాల్ చాంబర్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తారనే విమర్శలు ఉన్నాయి.

విచారణ కమిటీని కాలేజీలోకి అనుమతించలేదు

కేవీఆర్ కాలేజీలో ఒకే సెక్షన్‌లో ఎక్కువ మంది ఫెయిల్ అయ్యారు. దీనిపై ఆ కాలేజీ లెక్చరర్ ఫిర్యాదు మేరకు విచారణకు రిజిస్ట్రార్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేశాం. కాలేజీ ప్రిన్సిపాల్ విచారణకు అనుమతించలేదని కమిటీ ఇచ్చిన నివేదికను ఉన్నత విద్యాశాఖ అధికారులకు పంపించాం. వారు విచారణకు ఆర్జేడీని పంపించగా వాస్తవాలకు అనుగుణంగా విచారణ జరగలేదని తెలుస్తోంది. ఎవరైనా సరే విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలు ఆడకూడదు.

– డీవీఆర్ సాయిగోపాల్, క్లస్టర్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్

అనవసరంగా నాపై తప్పుడు ప్రచారం

కాలేజీలో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోవడం లేదు. విద్యార్థుల ఫెయిల్ అంశంపై క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆధ్వర్యంలో వీసీ ఏర్పాటు చేసిన కమిటీ విచారణకు వచ్చింది. అయితే తన దగ్గరకు కేవలం కమిటీలో ఉన్న లెక్చరర్లు వచ్చారు. రిజిస్ట్రార్ రాలేదు. నాపై అనవసరంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఫెయిల్ అయిన విద్యార్థులు రెగ్యులర్‌గా తరగతులకు వచ్చే వారు కాదు. ఆ లెక్చరర్ సైతం 134 క్లాసులకు 90 క్లాసులు మాత్రమే తీసుకున్నారు. దీనిపై నేను ప్రశ్నించడంతో ఫిర్యాదు చేశారు.

– డా.ఇందిరశాంతి, కేవీఆర్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్

విద్యా సమాచారం

సీబీఎస్ఈ ఫలితాల్లో ప్రతిభ

కర్నూలు సిటీ: శ్రీచైతన్య అకడమిక్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో నడుపుతున్న కట్టమంచి రామలింగారెడ్డి హైస్కూల్ విద్యార్థులు టెన్త్ సీబీఎస్ఈ ఫలితాల్లో ప్రభంజనం సృష్టించినట్లు ఆ స్కూల్ ఏజీఎం సురేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. 108 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా అందరూ ఉత్తీర్ణత సాధించారన్నారు.

నర్సింగ్ పరీక్ష ఫలితాల్లో గీతాంజలి ప్రతిభ

కర్నూలు(హాస్పిటల్): డాక్టర్ వైఎస్ఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వారు విడుదల చేసిన 2021-22వ బ్యాచ్ బీఎస్సీ నర్సింగ్ కోర్సు పరీక్ష ఫలితాల్లో కర్నూలులోని గాయత్రి ఎస్టేట్‌లో ఉన్న గీతాంజలి నర్సింగ్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు విజయభేరి మోగించినట్లు కరస్పాండెంట్ పెరుగు విజయవర్దన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం కళాశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. పరీక్ష ఫలితాల్లో 16 మంది డిస్టింక్షన్, 90 మంది ఫస్ట్‌క్లాస్, ఏడుగురు సెకండ్ క్లాస్ సాధించినట్లు తెలిపారు.

ఈరోజు

నగరంలో విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలో శనివారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. సబ్ డివిజన్ల పరిధిలోని 33 సబ్‌స్టేషన్లు, పోలీస్ క్వార్టర్స్, ప్రభుత్వ ఆసుపత్రి, ఎస్‌ఏపీ క్యాంప్, రేడియో స్టేషన్, సెంట్రల్ సెక్షన్, బళ్లారీ రోడ్డు, వీకర్ సెక్షన్ కాలనీ, నిర్మల్ నగర్, బాబా బృందావన్ నగర్, నరసింహారావు పేట, కొత్తపేట, నరసింహారెడ్డి నగర్, కింగ్ మార్కెట్, ప్రకాష్ నగర్, ఓర్వకల్లు, కర్నూలు మండలాల్లోని 33, 11కేవీ ఫీడర్లు, గ్రామాల్లో విద్యుత్ నిర్వహణ పనులు జరగనున్నాయని పేర్కొన్నారు. ఆయా సబ్‌స్టేషన్ల ద్వారా సరఫరా అందించే కాలనీలు, గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామన్నారు.

వ్యవసాయ విద్యుత్‌కు అధిక ప్రాధాన్యత

- 18 వేల పెండింగ్ దరఖాస్తులకు కనెక్షన్లు ఇచ్చాం
- డబ్బుల కోసం వేధిస్తే ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయండి
- విలేకరులతో విద్యుత్ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఉమాపతి



కర్నూలు(రాజ్‌విహార్): వ్యవసాయ అవసరాల కోసం అందించే విద్యుత్ సరఫరాకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విద్యుత్ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ముఖ్యంగా కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న 18వేల దరఖాస్తులకు విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేసినట్లు చెప్పారు. ఇందుకు కావల్సిన ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైను, స్తంభాలు, ఇతర సమాగ్రి అంతా ప్రభుత్వం మంజూరు చేసిందని, దీంతో పనులు అనుకున్న సమయం లోపు పూర్తి చేశామన్నారు. విద్యుత్ కనెక్షన్లకు కొత్తగా దరఖాస్తు చేసుకున్న రైతులకు గడువులోపు ఇస్తామన్నారు. ఇందుకు నిర్ణీత సొమ్మును డీడీల రూపంలో చెల్లిస్తే సరిపోతుందని, కాంట్రాక్టర్లు, విద్యుత్ ఉద్యోగులకు ఎవరికీ ఒక్క రూపాయి కూడా చేతికివ్వాల్సిన అవసరం లేదన్నారు. కనెక్షన్లు, ఎస్టిమేట్లు, జంపర్ పేర్లతో ఎవరైనా డబ్బు అడిగితే ఉన్నతాధికారులతో పాటు ఏసీబీ అధికారులకు కూడా ఫిర్యాదు చేయవచ్చునన్నారు. వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరే ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకు అనుగుణంగా సిబ్బంది పని చేయాలని ఆదేశించారు. అలాగే విధులు నిర్వహించే చోటే సిబ్బంది ఉండాలని సూచించారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లు, స్తంభాలను తొలగించడం, తీగల ఎత్తు పెంచడం, మధ్యలో ఇంటర్ పోల్ వేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. ఇందుకు ప్రభుత్వం రూ.35కోట్లు మంజూరు చేసిందన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే పట్టణ ప్రాంతాల్లో 48గంటల్లో, గ్రామీణ ప్రాంతాల్లో 24 గంటల్లో కొత్తది అమర్చుతున్నామని, ఎక్కడైనా సమస్య ఉంటే పై అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. జగనన్న కాలనీలకు విద్యుత్ కనెక్షన్లతో పాటు అందుకు సంబంధించిన వైరు, మీటర్, బోర్డును కూడా ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. టిడ్కో గృహాలకు ప్రత్యేక మేళ నిర్వహించి విద్యుత్ మీటర్లు మంజూరు చేస్తున్నామని, ఇప్పటి వరకు కర్నూలులో 550, ఆదోనిలో 350, నంద్యాలో 150 కనెక్షన్లు ఇచ్చినట్లు చెప్పారు. అన్ని ఫిర్యాదులకు విద్యుత్ పంపిణీ సంస్థ తీసుకొచ్చిన 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

దోమలు పుట్టకుండా జాగ్రత్త పడాలి


మాట్లాడుతున్న డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): ఇళ్లల్లో దోమలు పుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శుక్రవారం ఆయన పంచలింగాల గ్రామంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు దోమలు పుట్టకుండా చూద్దాం–దోమలు కుట్టకుండా చేద్దాం అనే నినాదాన్ని ప్రజలు పాటించేటట్లు చూడాలన్నారు. వారానికి ఒకసారి డ్రమ్ములు, తొట్టిలలోని నీటిని తొలగించి శుభ్రపరిచిన తర్వాత నీటితో నింపుకునేటట్లు ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఎవ్వరైనా జ్వర లక్షణాలు కలిగి ఉంటే వారికి నిర్ధారణ పరీక్షలు చేసి తగు చికిత్సలు ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం అదే గ్రామంలో జరుగుతున్న గ్రామీణ ఆరోగ్య పారిశుధ్య పోషకాహార కమిటీ సమావేశానికి హాజరై ఆరోగ్య కార్యక్రమాలు, ప్రభుత్వ ప్రోత్సాహాల గురించి వివరించారు. అలాగే వడదెబ్బ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలిపారు. అనంతరం పీహెచ్‌సీని సందర్శించి ఓపీ, ల్యాబ్, వ్యాక్సిన్, మాతాశిశు సేవలకు సంబంధించిన రికార్డులు, రిపోర్ట్‌లను పరిశీలించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట వైద్యాధికారి డాక్టర్ విజయ మాధురి, డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ మొబిలైజర్ ప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీలు, కమిటీ సభ్యులు, ఆరోగ్య పర్యవేక్షకులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

విద్యా సంస్థల దోపిడీని అరికట్టాలి

కర్నూలు(రూరల్): కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని, 2009 విద్యా హక్కు చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖాధికారి రంగారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం విద్యార్థి నాయకుడు మాట్లాడుతూ ఫీజుల వివరాలు నోటీసు బోర్డులో పొందుపరిచేలా చర్యలు తీసుకోవాలని, అడ్మిషన్ల పేరుతో ఉపాధ్యాయులను వేధిస్తున్న సంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రైవేటు విద్యాసంస్థల బస్సుల ఫిట్‌నెస్‌ను పరిశీలించాలన్నారు.

హజ్ యాత్రికులకు ప్రత్యేక శిక్షణ

కర్నూలు(రాజ్‌విహార్): పవిత్ర హజ్ యాత్రకు వెళ్లే వారికి ఈ నెల 14వ తేదీన ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు మస్జిద్ మర్కజ్ ఏ ఇస్లామీ అహ్లె హదీస్ మేనేజింగ్ కమిటీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. వడ్డెగేరి వీధిలో ఉన్న మర్కర్ మసీదులో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు ఈ శిక్షణ ఉంటుందని, ఈ కార్యక్రమానికి హాజరయ్యే వారికి మధ్యాహ్నం భోజనం, నమాజ్ సౌకర్యం కల్పించినట్లు తెలిపింది. హజ్ యాత్రకు వెళ్లే వారందరూ తప్పనిసరిగా హాజరై తగిన సూచనలు, సలహాలు పొందాలని సూచించారు.

చిన్నారులకు పండ్ల పంపిణీ

కర్నూలు (టౌన్) : నగరంలోని స్థానిక బి. క్యాంపు క్రీడా మైదానంలో రగ్బీ, హ్యాండ్‌బాల్ వేసవి శిక్షణ శిబిరంలో శిక్షణ తీసుకుంటున్న చిన్నారులకు క్రీడా సంఘం ప్రతినిధులు సురేంద్ర రామాంజనేయులు, ఎండీ బాషా పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని చిన్నారులు వినియోగించుకోవాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను శిబిరానికి పంపించాలన్నారు.

బీజేపీ చార్జ్‌షీటు

కర్నూలు(న్యూసిటీ): వైఎస్ఆర్‌సీపీ నాలుగేళ్ల పాలన అవినీతిమయమని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం శ్రీకృష్ణ దేవరాయల సర్కిల్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పొలంకి రామస్వామి ఆధ్వర్యంలో కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి చార్జ్‌షీటు వేశారు. ఈ కార్యక్రమానికి విష్ణువర్ధన్‌రెడ్డితోపాటు రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ హాజరయ్యారు. అనంతరం వారు కలెక్టర్‌ను కలసి చార్జ్‌షీటు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పార్థసారథి, కాశీ, విశ్వనాథ్, నాయక్, కళింగ నరసింహవర్మ పాల్గొన్నారు.

నైటింగేల్ స్ఫూర్తితో రోగులకు సేవలందించాలి


ఫ్లారెన్స్ నైటింగేల్ చిత్రపటానికి జ్యోతి వెలిగించి నివాళులర్పిస్తున్న డాక్టర్ నరేంద్రనాథ్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రిలో పనిచేసే నర్సింగ్ సిబ్బంది ఫ్లారెన్స్ నైటింగేల్ స్ఫూర్తితో రోగులకు సేవలందించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ జి. నరేంద్రనాథ్‌రెడ్డి చెప్పారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని శుక్రవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని క్లినికల్ లెక్చరర్ గ్యాలరీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్లారెన్స్ నైటింగేల్ చిత్రపటానికి డాక్టర్ నరేంద్రనాథ్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో దాదాపు 550 మందికి పైగా నర్సులు పనిచేస్తున్నారని, భవిష్యత్‌లో వీరి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఆసుపత్రిలో భవనాలు, విభాగాలు పెరుగుతున్న దృష్ట్యా నర్సింగ్ సూపరింటెండెంట్ల సంఖ్య కూడా పెరగనుందన్నారు. ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచేసి రాష్ట్రానికి తలమానికంగా ఉన్న జీజీహెచ్‌కు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి. వెంకటేశ్వర రావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, రేడియాలజి విభాగం హెచ్ఓడీ డాక్టర్ రాధారాణి, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కిరణ్, నర్సింగ్ సూపరింటెండెంట్ రామతులశమ్మ తదితరులు పాల్గొన్నారు.


మెడికవర్‌లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వైద్యులు

మెడికవర్‌లో ఘనంగా నర్సెస్ డే

కర్నూలు(హాస్పిటల్): కర్నూలులోని మెడికవర్ హాస్పిటల్‌లో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ఆసుపత్రుల్లో నర్సులులేనిదే ఎలాంటి వైద్యసేవలు కొనసాగవంటే ఆశ్చర్యం లేదన్నారు. డాక్టర్ టీవీసునీల్ యాదవ్, ఆసుపత్రి వైస్ ప్రెసిడెంట్ మహేశ్వరరెడ్డి,సెంటర్ హెడ్ నీలారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులను నమోదు చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు

కర్నూలు(సెంట్రల్): స్పందన ఫిర్యాదులను వివిధ ప్రభుత్వ శాఖల వారీగా నమోదు చేయాలని డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు కంప్యూటర్ ఆపరేటర్లను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఆయన తనచాంబరులో వివిధ శాఖలకు చెందిన కంప్యూటర్ ఆపరేటర్లతో సమావేశమయ్యారు. స్పందన అర్జీల నమోదులో దొర్లుతున్న తప్పులను సరిదిద్దుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఒక శాఖకు సంబంధించిన ఫిర్యాదును మరో శాఖకు సంబంధించి నమోదు చేస్తుండడంతో ఇబ్బందులు వస్తున్నాయన్నారు. క్రమంలో మొదట వచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా చదువుకుని ఏ శాఖకు సంబంధించిన ఫిర్యాదునో తెలుసుకొని నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ జి.వెంకటేష్ పాల్గొన్నారు.

ఉద్యోగులు, పెన్షనర్ల హక్కుల సాధనకు కృషి

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యోగులు, పెన్షనర్ల హక్కుల సాధనలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) ఎప్పుడూ ముందుంటుందని జిల్లా శాఖ అధ్యక్షుడు బంగి శ్రీధర్ తెలిపారు. శుక్రవారం కర్నూలులోని ఏపీజీఈఏ కార్యాలయంలో ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ఏపీజీఈఏ చేస్తున్న కృషిని వివరించారు.విశ్రాంత ఉద్యోగులకు ప్రతి నెల 1వ తేదీనే పెన్షన్, ఇతర ఆర్థిక ప్రయోజనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. భవిష్యత్తులో ఏపీజీఈఏ చేపట్టే కార్యక్రమాలకు పూర్తిగా మద్దతు ఇస్తామని పెన్షనర్లు ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సురేష్‌రెడ్డి, నగర కార్యదర్శి చెన్నకృష్ణ, ఇతర నాయకులు సురేష్‌బాబు, సుదర్శన్‌రెడ్డి, ఎన్‌డీ సంపత్, సోమేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

ఇస్లాం మార్గం శాంతి


ఈద్ మిలాప్ శాంతి సభలో మాట్లాడుతున్న బ్రదర్ సిరాజ్, చిత్రంలో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్) : సర్వమానవాళి శాంతి మార్గంలో నడవాలని ఇస్లాం సూచించిందని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ బ్రదర్ సిరాజ్‌ఉర్ రహమాన్ అన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఈద్ మిలాప్ కార్యక్రమం నిర్వహించారు. మస్జిదే అహలె హదీజ్ మర్కజ్ ఆధ్వర్యంలో శాంతిసభ నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇస్లాం ధర్మాలు సర్వమానవాళి శ్రేయస్సు కోరే చెప్పబడ్డాయన్నారు. పవిత్ర గ్రంథం ఖురాన్‌లో చెప్పిన మార్గాల్లో నడుచుకుంటే ముక్తి లభిస్తుందన్నారు. అనంతరం కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ మాట్లాడుతూ ఇస్లాం ధర్మం ప్రతి ఒక్కరి మంచిని కోరుకుంటుందని, చెడు మార్గాలను అనుసరించరాదని చెబుతుందన్నారు. ఇలాంటి శాంతి సభలు నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు డాక్టర్ డి.అబ్దుల్ హకీమ్, ప్రెసిడెంట్ ఇలియాజ్ బాషా, రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ మంజూర్ మౌలానా, కమిటీ సభ్యులు షఫి, అన్వర్, పార్టీ కార్పొరేటర్లు, పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

ఆర్‌యూలో పోస్టుల భర్తీపై హైకోర్టు స్టే

కర్నూలు(సిటీ):రాయలసీమ యూనివర్సిటీలో కాంట్రాక్ట్ పద్ధతిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఇటీవలే నోటిఫికేషన్ జారీ చేశారు. అయితే, ఈ పోస్టుల నియామకాల నోటిఫికేషన్‌లో రోస్టర్ పాటించలేదని కొందరు హైకోర్టును ఆశ్రయించారు. శుక్రవారం విచారణ చేపట్టిన న్యాయమూర్తి ఇరువురి వాదనలు విని భర్తీపై స్టే విధిస్తున్నట్లు ప్రకటించినట్లు సమాచారం.

విద్యుత్ భవన్‌లో ఆధునికీకరణ పనులు

కర్నూలు(రాజ్‌విహార్): దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ కర్నూలు విద్యుత్ భవన్‌లో ఆధునికీకరణ పనులు చేపట్టారు. ముఖ్యంగా సర్కిల్ కార్యాలయ ఆవరణలో కొంత కాలంగా సివిల్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రత్యేక నిధులతో ఈ పనులు చేయిస్తున్నట్లు కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి తెలిపారు. శుక్రవారం ఆయన ఆ పనులను పరిశీలించారు. గార్డియన్, పెయింటింగ్, ప్రత్యేక పూల మొక్కలు, పచ్చని గడ్డి, ప్లాంటేషన్, ఇతర మొక్కలు తెప్పించి సుందరీకరిస్తున్నట్లు వెల్లడించారు.

రేపు హనుమాన్ చాలీసా పారాయణం

కర్నూలు(సెంట్రల్): శ్రీ హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం (14వతేదీ) మొట్ట మొదటిసారి సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తున్నట్లు సీతారాముల కల్యాణ మహోత్సవ సమితి సభ్యుడు చల్లా దమోదార రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సత్యనారాయణ స్వామి దేవాలయానికి ఎదురుగా ఉన్న కేసీ కెనాల్ వినాయక ఘాట్‌లో సాయంత్రం 5 నుంచి 8గంటల వరకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో భాగంగా 5 గంటలకు సాంస్కృతి కార్యక్రమాలు, 6 గంటలకు ప్రవచనాలు, 7 గంటలకు హనుమాన్ చాలీసా పారాయణం, 8 గంటలకు శివశక్తి మధు బృందంతో కర్రసాము విన్యాసాలు ఉండనున్నట్లు చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలన్నారు.